# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 27-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒడిశాలో ఈరోజు 60 వేల కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు.
- ❖ భారతదేశం తన పర్యాటక విధానంలో అనుసంధానానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు.
- ❖ ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 12వ ఎడిషన్ ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభమైంది.
- ❖ బంగాళాఖాతంలోని వాయుగుండం దక్షిణ ఒడిశా-గోపాల్‌పూర్ సమీపంలో ఈరోజు తీరం దాటిందని భారత వాతావరణ విభాగం తెలిపింది.

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒడిశాలో ఈ రోజు 60 వేల కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. రైల్వేలు, ఉన్నత విద్య, ఆరోగ్య సంరక్షణ, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ గృహ నిర్మాణ రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులు ఇందులో భాగంగా ఉన్నాయి. ఒడిశాలోని బెర్హంపూర్, గుజరాత్ లోని ఉధ్నా మధ్య నడిచే అమృత్ భారత్ ఎక్స్ ప్రెస్ ను ప్రధానమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అదే విధంగా BSNL నూతనంగా ఏర్పాటు చేసిన 97 వేల 500 4G మొబైల్ టవర్లను కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. కేంద్రప్రభుత్వం ఇటీవల ఒడిశాలో రెండు సెమీకండక్టర్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపిందని, సెమీకండక్టర్ పార్క్ ను కూడా అభివృద్ధి చేయాలని యోచిస్తోందని తెలిపారు. ఇది ఒడిశాను సాంకేతికంగా మరింత ముందుకు తీసుకెళ్లడంలో ఒక ముఖ్యమైన అడుగు అని ఆయన పేర్కొన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

ఇక టెలికాం రంగం గురించి ప్రస్తావిస్తూ.. భారత్ తన సొంత టెలికాం నెట్ వర్క్ ను నిర్మించుకుందని చెప్పారు. భవిష్యత్‌లో భారతదేశం టెలికాం సాంకేతికతకు ప్రపంచ కేంద్రంగా మారుతుందని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

(వాయిస్ 28 సెకన్లు)

=====================

భారతదేశం తన పర్యాటక విధానంలో అనుసంధానానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ... ఉడాన్ పథకం వంటి కార్యక్రమాలు పర్యాటక ప్రదేశాలకు కనెక్టివిటీని మెరుగుపరిచాయని చెప్పారు. ఇక ప్రసాద్ పథకం తీర్థయాత్ర గమ్యస్థానాల అభివృద్ధికి దోహదపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నీతి ఆయోగ్ వైస్ ఛైర్ పర్సన్ సుమన్ బేరీ మాట్లాడుతూ... ఆర్థిక పరివర్తన, పర్యావరణ నియంత్రణకు పర్యాటకం ఒక శక్తివంతమైన సాధనమని అన్నారు. స్థిరమైన పర్యాటకం జీవనోపాధిని కల్పిస్తూనే జీవవైవిధ్యాన్ని కాపాడగలదని ప్రపంచ వ్యాప్తంగా రుజువైందన్నారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 126వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.. "మన్ కీ బాత్" తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

=====================

`స్వచ్ఛతా హీ సేవా` కార్యక్రమంలో భాగంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులు ఈరోజు న్యూఢిల్లీలో మొక్కలు నాటారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన, పచ్చని దేశాన్ని నిర్మించే ప్రయత్నాలను ఈ కార్యక్రమం ప్రోత్సహిస్తుందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. పర్యావరణాన్ని పరిరక్షించడం అనేది ఒక విధానపరమైన లక్ష్యం మాత్రమే కాదని మొక్కలు నాటడం వంటి శక్తివంతమైన చర్యలతో ప్రారంభమయ్యే ఒక నైతిక బాధ్యత అనే సందేశాన్ని వ్యాప్తి చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపింది.

=====================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధిపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 100 సెకన్లు)

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జీఎస్టీ సరళీకరణపై కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి రాసిన ఒక వార్తా కథనాన్ని ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ లో పంచుకున్నారు. ఈ కథనంలో పేర్కొన్న GST సరళీకరణతో పాటూ పౌర కేంద్రీకృత మౌలిక సదుపాయాలు ప్రణాళికల నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయన్నారు. ప్రభుత్వ ఫలాలు ప్రతి పౌరుడికి చేరేలా ఈ కార్యక్రమాలు చూస్తాయని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

=====================

ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 12వ ఎడిషన్ న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈరోజు ప్రారంభమైంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఛాంపియన్‌షిప్‌లో మొత్తం 186 పతకాల కోసం అథ్లెట్లు పోటీ

పడనున్నారు. తొలి రోజు భారత అథ్లెట్లు అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం 7 పతకాలు గెలుచుకోగా సీతల్ దేవి, తోమన్ కుమార్ లు స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. ఈ ఛాంపియన్‌షిప్ వచ్చే నెల 5వ తేదీన ముగుస్తుంది.

====================

ఆసియా కప్ -2025 తుది అంకానికి చేరుకుంది. ఈ టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో దాదాపు 41 సంవత్సరాల తరువాత భారత్ పాకిస్థాన్‌తో ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. ఇప్పటి వరకు జరిగిన అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించిన భారత్ రేపు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో కూడా గెలిచి ఆసియా కప్ టైటిల్‌ను కైవసం చేసుకునేందుకు సిద్ధమవుతుంది. భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే ఈ ఫైనల్ మ్యాచ్ దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుంది.

====================

బంగాళాఖాతంలోని వాయుగుండం ఈరోజు ఉదయం తీరం దాటింది. దక్షిణ ఒడిశా-గోపాల్‌పూర్ సమీపంలో వాయుగుండం తీరాన్ని తాకిందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఇది పశ్చిమ దిశగా ఛత్తీస్‌గఢ్ వైపు కదిలి బలహీనపడుతుందని పేర్కొంది. ఇదిలా ఉండగా మహారాష్ట్ర, ఒడిశా, కొంకణ్, గోవాలలో రాబోయే మూడు రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది. ఈ నెల 30 వరకు అండమాన్, నికోబార్ దీవులు, కోస్తాంధ్ర, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్, సిక్కిం, ఛత్తీస్‌గఢ్‌లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మరిన్ని వివరాలను వాతావరణ శాస్త్రవేత్త అమిత్ కుమార్ వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

====================
====================